పింఛన్ కోసం పాట్లు

- వలంటీర్ సేవల నిలిపివేతతో వృద్ధులు, దివ్యాంగులకు అవస్థలు
- చంద్రబాబు కుటిల రాజకీయాలపై మండిపాటు
- సచివాలయాల వద్ద పింఛన్‌దారుల పడిగాపులు
- మళ్లీ పాత రోజులొచ్చాయని ఆవేదన



53వ వార్డు గ్రీన్ గార్డెన్స్ సచివాలయం వద్ద పడిగాపులు కాసున్న పింఛన్‌దారులు



కోడలి సహాయంతో పింఛన్ తీసుకునేందుకు సచివాలయానికి వచ్చిన వృద్ధురాలు శారమ్మ

సీతంపేట/మద్దిపాలెం/తాటిచెట్లపాలెం: వార్డు వలంటీర్లపై టీడీపీ అధినేత చంద్రబాబుకున్న కక్ష పింఛన్‌దారుల పాలిట శాపంగా మారింది. సంక్షేమ పథకాలు గడప వద్దకే చేరుస్తున్న వలంటీర్లను ప్రజలకు దూరం చేయాలన్న దురుద్దేశంతో ఎన్నికల వేళ కుట్ర రాజకీయాలకు తెరతీశారు. ఫలితంగా పింఛన్ డబ్బుల కోసం అవ్వాతాతలు, దివ్యాంగులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి నెలకొంది. టీడీపీ హయాంలో ఐదేళ్ల కిందటి పాత రోజులు మళ్లీ పలకరించాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెన్షన్ కోసం కాళ్లు ఈడ్చుకుంటూ సచివాలయాల ముందు లైన్‌లో నిలబడాల్సి వచ్చింది. పింఛన్ సొమ్ము కోసం పండుటాకులు అవస్థలు పడకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి వద్దకే పింఛన్లు ఇచ్చే ఏర్పాటు చేశారని, గత నాలుగేళ్ల పది నెలలుగా ఇంటి వద్దే పింఛన్ తీసుకుంటున్నామని, చంద్రబాబు కుట్రతో మళ్లీ రోడ్డెక్కాల్సివచ్చిందని పింఛన్‌దారులు మండిపడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

వలంటీర్లు లేకపోవడంతో కూలి పనికి వెళ్లే నిరుపేదలు పని మాని పింఛన్ కోసం సచివాలయం వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చిందని, ఒకరోజు పనికి వెళ్లకపోతే రూ.800 కూలి డబ్బులు పోయినట్టేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక దివ్యాంగుల పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఇళ్లు కదలని దివ్యాంగులు సచివాలయానికి వెళ్లి పింఛన్ అందుకోలేక, వలంటీర్ ఇంటికి రాక, ఎవరు వచ్చి పింఛన్ ఇస్తారోనని దీనంగా ఎదురుచూస్తున్నారు. పింఛన్ కోసం అడిగితే.. వెంటనే కావాలంటే సచివాలయానికి రండి, లేదంటే రెండు రోజుల్లో ఇంటికి వచ్చి ఇస్తామంటున్న సిబ్బంది తీరుతో దివ్యాంగులు, కదల్లేని వృద్ధులు బాధపడుతున్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే ప్రతి నెలా ఇటువంటి బాధలు తప్పవని, రానున్న ఎన్నికల్లో బుద్ధి చెబుతామని పింఛన్‌దారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబుకు బుద్ధి చెబుతాం

హాయిగా ఇంటి ముంగిటకే వచ్చిన పెన్షన్.. ఇప్పుడు ప్రతిపక్షాల చేసిన కుట్రకు లబ్ధిదారులు ఇక్కట్లు పడుతున్నారు. చంద్రబాబుకు తగిన బుద్ధి చెబుతాం అంటున్నారు. జీవీఎంసీ 49, 50, 51, 53 వార్డుల్లోని అన్ని సచివాలయాల్లో రెండో రోజు గురువారం పెన్షన్లు పంపిణీ చేశారు. అవ్వా తాతలు, వితంతువులు, దివ్యాంగులు, ఇలా లబ్ధిదారులందరికీ సచివాలయ సిబ్బంది పింఛన్ నగదు అందజేశారు. పలు సచివాలయాల వద్ద పింఛన్‌దారులు బారులు తీరారు. మండుటెండలో పడిగాపులు కాశారు. ఇలాంటి ఇబ్బందులు పెడుతున్న ప్రతిపక్షాలను తరమికొడతామని కొందరు చెబుతున్నారు. అధికారంలోకి రాకుండానే ప్రజలను ఇన్ని ఇబ్బందులు పెడుతున్న పెద్దమనుషులు.. అధికారం చేతికొస్తే మాలాంటి వాళ్ల పరిస్థితి ఏంటని మాట్లాడుకుంటున్నారు.

ఉసురు పెట్టకండి



80 ఏళ్ల వయసులో నడవలేను. కళ్లు సరిగా కనిపించవు. వలంటీర్ రారు, సచివాలయానికి వెళ్లి పింఛన్ తీసుకోవాలని చెప్పారు. ఆటో కట్టించుకుని సచివాలయానికి వచ్చాను. మెట్లు ఎక్కే శక్తి లేక ఆదే ఆటోలో వెనుదిరిగాను. సచివాలయ సిబ్బందికి చెబితే ఇంటికొచ్చి ఇస్తాం, వెళ్లిపోండని చెప్పారు. మర్నాడు ఇంటికి వచ్చి ఇచ్చారు. మాలాంటి ముసలివాళ్లను ఉసురు పెట్టడం తగునా.

– పి.సుశీల, సీతంపేట, 25వ వార్డు

మళ్లీ జగనే రావాలి



మళ్లీ మాకు ముఖ్యమంత్రిగా వైఎస్ జగనే రావాలి. ఈ రోజుల్లో ఒక ఇంట్లో ఇద్దరు అన్నదమ్ములు, నలుగురు స్నేహితుల మధ్యే సఖ్యత ఉండటం లేదు. అలాంటిది మూడు పార్టీలు కలిసి రాష్ట్రాన్ని, దేశాన్ని ఉద్ధరిస్తాయంటే నమ్మడానికి ఇక్కడ ఎవ్వరూ సిద్ధంగా లేము. ఈ ఐదేళ్లలో పెన్షన్ కోసం ఎవరూ గడప దాటలేదు. అలాంటిది రోడ్డు మీద ఉదయం నుంచి పడిగాపులు కాస్తున్నాం. కుట్ర రాజకీయాలు చేస్తే ప్రజలు మోసపోవడానికి సిద్ధంగా లేరు. వలంటీర్లను ఇబ్బంది పెట్టి, కేసులు పెట్టించి వారిని విధుల నుంచి తొలగించి, మాకు వారు అందిస్తున్న సేవలను చేయనివ్వకుండా ఆపేశారు. రానున్న ఎన్నికల్లో ఓట్లు రూపంలో సమాధానం చెప్తాం.

– గండి ఎరుకులమ్మ, శ్రీరాంనగర్, 53వ వార్డు

వృద్ధులను ఇబ్బంది పెట్టడం సరికాదు



ఈ నెల నుంచి వలంటీర్లు పింఛన్లు ఇవ్వరని, సచివాలయానికి వెళ్లి తీసుకోవాలని చెప్పడంతో ఏం చేయాలో తోచక మా కోడలు సహాయంతో పింఛన్ తీసుకోవడానికి వచ్చాను. నేను ఒక్కదానినే నడవలేను. అందువల్లే కోడలితో వచ్చాను. గతంలో మా ఇంటికి వచ్చి వలంటీర్లు పింఛన్ అందించేవారు. అప్పట్లో ఏ ఇబ్బంది ఉండేదికాదు. ఇప్పుడు ఇలా పింఛన్లు ఇవ్వకూడదని వలంటీర్లను ఆపి మమ్మల్ని ఇబ్బంది పెట్టడం సరికాదు. ఇలా బాధ పెట్టిన వారికి తగిన గుణపాఠం చెబుతాం. మళ్లీ జగన్ బాబునే గెలిపించుకుంటాం.

– శారమ్మ, తారకరామానగర్, 45వ వార్డు

వలంటీర్లను నిలిపివేయడం బాధాకరం



ఎప్పుడూ ఒకటో తేదీనే పింఛన్లు అందుకునే వాళ్లం. ఈ నెలలో చంద్రబాబు, తెలుగుదేశం పార్టీ వాళ్లు వలంటీర్లు పింఛన్లు ఇవ్వకుండా అడ్డుకున్నారని తెలిసి చాలా బాధపడ్డాం. నేను వికలాంగురాలిని. పింఛన్ కోసం గతంలో ఎన్నో ఇబ్బందులు పడ్డాను. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రతీ నెలా క్రమం తప్పకుండా ఒకటో తేదీనే పింఛన్ అందుకుంటున్నాను. మళ్లీ జగనన్నే రావాలి. మా కష్టాలు తీర్చాలి.

– వాణి, ఏఎస్సార్ నగర్, 45వ వార్డు

వైఎస్సార్‌సీపీని గెలిపించండి



బాబు జగ్జీవన్ రామ్‌నగర్‌లో వృద్ధురాలిని పలకరిస్తున్న కె.కె.రాజు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం పరిధి పెదకొత్తూరు, బాబు జగ్జీవన్ రామ్‌నగర్, రాంజీ ఎస్టేట్ కొండవాలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని ఆయన కోరారు. వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. ఎన్నికల కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వార్డు ఎన్నికల పరిశీలకుల నియామకం



రవిరాజు / రేవతీ రావు / రవీంద్ర నాథ్ ఠాగూర్ / భరణికాన రామారావు

అల్లిపురం: ఉత్తర నియోజకవర్గంలోని జీవీఎంసీ వార్డులకు ఎన్నికల పరిశీలకులను నియమించినట్లు వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 14, 24 వార్డులకు బాక్సర్ రాజు, 25, 26 వార్డులకు జి.వి.రవిరాజు, 42వ వార్డుకు కె.రేవతీ రావు, 43, 44 వార్డులకు పులపా రవీంద్రనాథ్ ఠాగూర్, 45, 46 వార్డులకు సేనాపతి అప్పారావు, 47, 48 వార్డులకు బొగ్గు శ్రీను, 49, 50 వార్డులకు భరణికాన రామారావు, 51, 55 వార్డులకు లంకా భాస్కర్, 51, 53 వార్డులకు శ్యామ్‌కుమార్ రెడ్డిని పరిశీలకులుగా నియమించినట్లు ఆయన తెలిపారు.

క్లుప్తంగా

'ఆరోగ్య సురక్ష' సేవలు భేష్



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

మద్రిపాలెం: ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నిర్వహిస్తున్న వైద్య సేవలు భేష్ అని రోగులు ప్రశంసిస్తున్నారు. జీవీఎంసీ 50వ వార్డు మురళీనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. నిపుణులైన డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి తగు సూచనలు చేశారు. వైద్య సేవలు పొందిన వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. యూపీహెచ్‌సీ డాక్టర్లు వెంకటేష్, నాయుడు, శ్రీనివాస్ వైద్య సేవలు అందించారు.

10 మద్యం సీసాల స్వాధీనం

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యం విక్రయించడానికి తీసుకెళ్తున్న మహిళను అదుపులోకి తీసుకుని విచారించి 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం దుర్గానగర్ చాకలిగెడ్డ ప్రాంతానికి చెందిన కందిపిల్లి కనక అనే మహిళ 10 (180 ఎంఎల్) మద్యం సీసాలను అక్రమంగా విక్రయించడానికి తీసుకెళ్తున్న క్రమంలో.. గురువారం ఉదయం వాషింగ్‌లైన్ వద్ద పట్టుకున్నారు. ఆమె వద్ద నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ధ్యాన మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం హారతి అనంతరం ధ్యాన మందిర ఆవరణలో భక్తులు, పేదలు, యాచకులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు మాట్లాడుతూ భక్తులు, దాతల సహకారంతో నిత్యాన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏ సమయంలోనైనా అన్నార్తుల ఆకలి తీర్చేందుకు కమ్యూనిటీ ఫ్రిజ్‌లో ఆహారం ఉంచుతున్నట్లు చెప్పారు. ఈ నెల 9న ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు, మహా అన్నదానం నిర్వహిస్తున్నట్ల ధ్యాన మందిర వ్యవస్థాపకులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు తెలిపారు. సాయంత్రం నుంచి బాబా భజన, హారతి కార్యక్రమాలు, పల్లకీ సేవ నిర్వహించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలోని అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, అబిద్‌నగర్ ప్రాంతాల్లో నూతన లైన్ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అక్కయ్యపాలెం, అబిద్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

7న జూలో ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు

ఆరిలోవ: ఈ నెల 8న జూలో నేషనల్ జూ లవర్స్ డే నిర్వహించనున్నట్లు జూ క్యూరేటర్ నందనీ సలారియా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 7న మూడు నుంచి 12 ఏళ్ల వయసు గల పిల్లలకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహిస్తామన్నారు. జూలో ఉన్న జంతువులు థీమ్ ప్రకారం చిన్నారులు డ్రెస్‌లు వేసుకొని పోటీలో పాల్గొనాలన్నారు. చిన్నారుల వేషం జంతువులకు సంబంధించిన సమాచారం ఇచ్చేదిగా ఉండాలన్నారు. ఈ నెల 7న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి గల చిన్నారులు వివరాల కోసం 94411 30894 నంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

ముస్లింల ఆప్యాయత మరువలేనిది

వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు



ఇఫ్తార్ విందులో కె.కె.రాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ముస్లిం మహిళలు

కంచరపాలెం: ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, వారి ఆప్యాయత మరువలేనిదని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 48వ వార్డు బర్మాక్యాంప్ మసీదు స్ట్రీట్ వద్ద స్థానిక ముస్లింలు గురువారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకుని ముస్లింలతో కలిసి ఇఫ్తార్‌లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తన విజయానికి ముస్లింలు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి నీలి రవి, 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ, సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి, నాయకులు ఫరూఖీ, కె.వి.బాబా, వసంతల అప్పారావు, షేక్ బాజ్జీ, భూలోక్, శ్రీను, చిన్న, కృష్ణ, గంగరాజు, షేక్ మదీనా, బషీర్ ఆలం, గౌస్, భాస్కర్, సునీల్, వార్డు నాయకులు, మహిళలు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

15 నుంచి ఓపెన్ డిగ్రీ విద్యార్థులకు ప్రాక్టికల్స్

మద్దిలపాలెం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2021-22 విద్యా సంవత్సరం ప్రవేశం పొందిన విద్యార్థులకు ఈ నెల 15 నుంచి ప్రాక్టికల్ పరీక్షలతో పాటు, నాలుగో సెమిస్టర్ తరగతులు నిర్వహించనున్నామని అధ్యయన కేంద్ర కోఆర్డినేటర్ జి.రాజుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు టైమ్ టేబుల్‌ను పోస్టల్ చిరునామాలకు పంపించామని పేర్కొన్నారు. విధిగా విద్యార్థులు హాజరు కావాలని సూచించారు.

30 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నిందితులను విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలు ప్రకారం.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్‌ఐ వి.బాలాజీరావు సిబ్బందితో కలిసి విశాఖ రైల్వేస్టేషన్‌లో పలు ప్లాట్ ఫాంలలో గురువారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. మహారాష్ట్రకు చెందిన షేక్ సాధిక్, షేక్ గని బ్యాగ్‌లను తనిఖీ చేయగా బ్యాగుల్లో అక్రమంగా రవాణా చేస్తున్న సుమారు రూ.1.50 లక్షల విలువైన 30 కేజీల గంజాయి గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ బాలాజీరావు తెలిపారు. వీరు విశాఖ మీదుగా సికింద్రాబాద్‌కు గంజాయిని రవాణా చేస్తున్నట్లు తెలిపినట్లు పేర్కొన్నారు.

10న భద్రావతి సమేత భావనారుషి కల్యాణం



కల్యాణ ఆహ్వాన పత్రాలను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, సంఘ ప్రతినిధులు

సీతంపేట: శ్రీభక్త మార్కండేయ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10న పద్మశాలీల కులదైవం భద్రావతి సమేత భావనారుషి స్వామి వార్ల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ చేతుల మీదుగా గురువారం కల్యాణ ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. సంఘం తరపున ఆయనకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ 10వ తేదీ బుధవారం ఉదయం 10.32 గంటలకు సీతంపేట దుర్గాగణపతి ఆలయం వెనుక రోడ్డులో అంగరంగ వైభవంగా కల్యాణం జరుగుతుందన్నారు. సుమారు 200 మంది పద్మశాలి దంపతులు పాల్గొంటారని, వారు పంచె, చీర ధరించాలన్నారు. రాజమహేంద్రవరానికి చెందిన ఆమంచి ఆంజనేయ గురుస్వామి నేతృత్వంలో కల్యాణ మహోత్సవం జరిపించడానికి ఏర్పాట్లు చేశామని చెప్పారు. కల్యాణం అనంతరం సుమారు 5 వేల మందికి అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. సాయంత్రం 5 గంటలకు సీతంపేట పురవీధుల్లో భద్రావతి సమేత భావనారుషి స్వామి వార్ల ఉత్సవ మూర్తుల ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు. పద్మశాలి కులస్తులు పెద్ద ఎత్తున కల్యాణంలో పాల్గొని, అన్నప్రసాదం స్వీకరించాలని కోరారు.

లుక్.. హైటెక్..!

- వైఎస్సార్ నగర్‌లో ఆధునిక సామాజిక భవనం
- యుద్ధప్రాతిపదికన నిర్మాణ పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



పూర్తి హంగులతో కమ్యూనిటీ హాల్ గ్రౌండ్ ఫ్లోర్



45వ వార్డు వైఎస్సార్ నగర్‌లో నిర్మించిన ఆధునిక సామాజిక భవనం

తాటిచెట్లపాలెం: పేదలు నివసించే ఆ ప్రాంతంలో ఏ శుభకార్యమైనా వేల రూపాయల్లో అద్దెలు చెల్లించి జరిపించుకునేవారు. లేదంటే ఆరుబయటే ఫంక్షన్లు నిర్వహించుకునేవారు. ఎండైనా, వానైనా ఇదే పరిస్థితి. జీవీఎంసీ 45వ వార్డు వైఎస్సార్ నగర్‌లో నివసిస్తున్న వారి గోడు ఇది. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతంలో తమ అవసరాల కోసం సామాజిక భవనం నిర్మించాలని ప్రజాప్రతినిధుల చుట్టూ కాలనీ వాసులు ప్రదక్షిణలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో బీజేపీ ఎమ్మెల్యేగా ఉన్న పి.విష్ణుకుమార్‌రాజు తూతూ మంత్రంగా ఇక్కడ సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసినా.. దానిని పూర్తి చేయకుండానే కాంట్రాక్టరు చేతులెత్తేశారు. ప్రభుత్వాలు మారినా తమ పరిస్థితి మాత్రం మారలేదు. ఇక్కడ 2019లో ఎమ్మెల్యేగా గెలిచిన గంటా శ్రీనివాసరావు ఏనాడు నియోజకవర్గంలో పర్యటించిన సందర్భాలు లేవు. దీంతో స్థానికులు వార్డు కార్పొరేటర్ కంపా హనోకు, పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణల సహకారంతో వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును కలిసి ఈ సమస్యను విన్నవించారు. స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి అసంపూర్తిగా నిలిచిపోయిన సామాజిక భవనం కోసం నిధులు మంజూరు చేయించి, యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయించారు.

రూ.58 లక్షలతో సుందరంగా నిర్మాణం

వైఎస్సార్ నగర్‌లో జీవీఎంసీ నిధులు సుమారు రూ.58 లక్షలతో రెండతస్తుల్లో ఆధునిక సామాజిక భవనాన్ని నిర్మించారు. దీనిని ఇటీవల ప్రారంభించారు.

ఇటువంటి నూతన సామాజిక భవనాలు గత ప్రభుత్వాల హయాంలో ఎక్కడా కనబడవు. ఎంతో సుందరంగా, ఎక్కడా రాజీ పడకుండా ప్రైవేట్ ఫంక్షన్ హాల్స్ తరహాలో ఈ కమ్యూనిటీ హాల్‌ను నిర్మించారు. గ్రానైట్ మార్బుల్ ఫ్లోరింగ్, సీలింగ్, రెయిలింగ్, ఎలివేషన్ ఇలా అన్నీ ఎంతో సుందరంగా దర్శనమిస్తున్నాయి. గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం పూర్తి కాగా.. మొదటి అంతస్తులో పెండింగ్‌లో ఉన్న కొన్ని పనులను కూడా పూర్తి చేసి త్వరలోనే ఈ భవనాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని జీవీఎంసీ అధికారులు తెలిపారు.

తొలగిన ఇబ్బందులు

వార్డులోని వైఎస్సార్ నగర్, వాసుదేవనగర్, చిట్టిబాబు కాలనీ, సంతోషిమాత కాలనీ, ఏఎస్సార్ నగర్ ప్రాంతాల వాసులకు ఈ సామాజిక భవనం ఎంతో అనువుగా ఉంటుంది. గతంలో ఈ కాలనీల ప్రజలు శుభకార్యాలు, ఇతర కార్యక్రమాల నిర్వహణకు ఎంతో ఇబ్బంది పడేవారు. ఇప్పుడు ఆధునిక సామాజిక భవనం అందుబాటులోకి రావడంతో వీరి సమస్య తీరింది. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేసిన ప్రజాప్రతినిధులకు వైఎస్సార్ నగర్ వాసులు కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎంతో సంతోషంగా ఉంది



మా కాలనీలో ఏ శుభకార్యం జరపలన్నా చాలా ఇబ్బంది పడేవాళ్లం. నేడు మా కోసం అందమైన సామాజిక భవనాన్ని నిర్మించడం చాలా సంతోషంగా ఉంది. మా ఇళ్లలో ఏ శుభకార్యమైనా ఇక్కడే చేసుకోవచ్చు. ఇంత వేగంగా ఈ భవనాన్ని నిర్మించడంలో కృషి చేసిన ప్రజాప్రతినిధులు కె.కె.రాజు, కంపా హనోకు, పైడి రమణలకు ధన్యవాదాలు.

– వెంకటలక్ష్మి, వైఎస్సార్ నగర్

సామాజిక భవనం చాలా బాగుంది



ఈ కాలనీలోనే మేం పుట్టి, పెరిగాం. గతంలో ఏదో చిన్న కమ్యూనిటీ హాల్ ఇక్కడ ఉండేది. ఆధునికంగా నిర్మించిన ఈ సామాజిక భవనం చాలా బాగుంది. ఇకపై మా కాలనీలో జరిగే ఫంక్షన్లన్నీ ఇక్కడే చేసుకోవచ్చు. అందమైన ఫ్లోరింగ్, సీలింగ్, ఎలివేషన్ అన్నీ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లా ఉన్నాయి. కె.కె.రాజు, కార్పొరేటర్ కంపా హనోకు, పైడి రమణలకు కృతజ్ఞతలు.

– మీరా, వైఎస్సార్ నగర్

కిరండూల్ పాసింజర్‌కు థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్

తాటిచెట్లపాలెం: వేసవి వేళ ప్రయాణికుల సౌకర్యార్థం ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ పరిధిలో నడుస్తున్న విశాఖపట్నం - కిరండూల్ (08551/08552) పాసింజర్ స్పెషల్ రైలుకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్ జత చేస్తున్నట్లు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. ఏప్రిల్ 8 నుంచి జూలై 1 వరకు థర్డ్ ఏసీ ఎకానమి కోచ్ జత చేస్తున్నామని, ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని సూచించారు.

- వాల్తేర్ డివిజన్, కేకే లైన్ పరిధి బొర్రా గుహలు - కరకవలస స్టేషన్ల మధ్య బ్రిడ్జి పునర్నిర్మాణ పనులు చేపడుతున్నందున ఏప్రిల్ 10న విశాఖపట్నం - కిరండూల్ (08551), కిరండూల్ - విశాఖపట్నం(085520 పాసింజర్ రైళ్లు ఇరువైపులా రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

నేడు కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగే ఈ పూజలో రూ.500 రుసుం చెల్లించిన దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు ఈవో పి. శ్రీనివాసులరెడ్డి చెప్పారు. పైపూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



వరాహగిరి మురళీధర్(ఫైల్)

మద్రిపాలెం: కంచరపాలెం 5వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివిరాలు ఇలా ఉన్నాయి. ఓల్డ్ ఐటీఐ జంక్షన్ దరి హ్యాపీహోమ్స్ అపార్ట్‌మెంట్‌లో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న వరాహగిరి మురళీధర్ (19) సెకండ్ ఇయర్ బీటెక్ చదువుతున్నాడు. బుధవారం రాత్రి ఫోన్ సిగ్నల్ రావడం లేదు.. టెర్రస్ పైకి వెళ్తున్నా అని చెప్పి వెళ్లాడు. తర్వాత ఫ్లాట్స్‌లో ఉన్నవారు ఎవరో కింద పడిపోయారు అని చెప్పడంతో తల్లిదండ్రులు వెళ్లి చూడగా వారి కుమారుడు మురళీధర్ అని తెలిసి కొన ఊపిరితో ఉన్న అతన్ని అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్టు తెలిపారు. తాను అనుకున్నది చేయలేకపోతున్నానని మనస్థాపం చెంది, సోదరుడిని బాగా చదివించమని వాట్సాప్ స్టేటస్ పెట్టాడని మృతుని స్నేహితులు తల్లిదండ్రులకు తెలిపారు. యువకుడి తండ్రి దుర్గా మహేష్ గిరి ఫిర్యాదు మేరకు గురువారం రాత్రి సీఐ ఎస్. భాస్కరరావు నేతృత్వంలో ఏఎస్‌ఐ కనకరాజు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో విస్తృత తనిఖీలు



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న సెబ్ అధికారులు

అల్లిపురం: మహారాణిపేట స్పెషల్ ఇన్వెస్టిమెంట్ బ్యూరో(ఎస్ఈబీ) ఆధ్వర్యంలో గురువారం అధికారులు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అక్రమ మద్యం, నగదు రవాణా అరికట్టడంలో భాగంగా నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని సీఐ మధుకుమార్ తెలిపారు. జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు డాగ్ స్క్వాడ్‌తో ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పోలీసులతో కలిసి సెబ్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సుబ్బారావు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మహారాణిపేట సెబ్ స్టేషన్ పరిధిలో 37 బెల్ట్ కేసులు నమోదు చేశామని తెలిపారు. ఎవరైనా సమాచారం అందిస్తే తక్షణమే స్పందిస్తామని తెలిపారు. ఈ తనిఖీల్లో సీఐ రాజులనాయుడు, ఎస్‌ఐలు మోహన్, వేణు పాల్గొన్నారు.